క్లుప్తంగా

కాటాలకు సీళ్లు



కాటాలకు సీళ్లు వేస్తున్న ఇన్‌స్పెక్టర్ దామోదర్‌నాయుడు

పూసపాటిరేగ: స్థానిక పెట్రోల్‌బంకు సమీపంలో ఉన్న మిల్లులో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ దామోదర్ నాయుడు శనివారం తనిఖీలు చేపట్టారు. కాటాలను పరిశీలించి బరువులో వ్యత్యాసం ఉన్న కాటాలను సరిచేసి సీళ్లు వేశారు. అలాగే మండల పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన వ్యాపారుల తీసుకొచ్చిన సుమారు 75 కాటాలకు సీళ్లు వేశారు.

24 నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక

విజయనగరం: ఈనెల 24 నుంచి ప్రతీ సోమవారం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలోని మొదటి అంతస్తులో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ సోమవారం ఉదయం 10:30 గంటలకు ఈ కార్యక్రమం మొదలవుతుందన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కారం పొందాలని కోరారు.

అలరించిన భక్తి కళారాధన



ఆలయ ప్రాంగణంలో కోలాటం ఆడుతున్న మహిళలు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శనివారం నిర్వహించిన భక్తి కళారాధన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. రాయివలస, మెరకముడిదాం, చీపురుపల్లి తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు స్వామి సన్నిధిలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు చేపట్టిన కోలాటం భక్తులను ఎంతగానో అలరించింది. దేవస్థాన సిబ్బంది కళాకారులను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బహుమతుల అందజేత



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధికారులు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని వీటీ అగ్రహారం స్కూలు విద్యార్థులకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఐసీడీఎస్ నోడల్ అధికారి విజయకుమారి, సీడీపీఓ ప్రసన్న బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరావు, పీటీ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు 806 మంది హాజరు

నెల్లిమర్ల: ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న మహాత్మాజ్యోతి బాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షకు 806 మంది విద్యార్థులు హాజరైనట్లు కన్వీనర్, ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహిని తెలిపారు. శనివారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలోని మొత్తం పది పాఠశాలల్లో 6 నుంచి 9 వతరగతి వరకు మిగులు సీట్ల భర్తీ కోసం ఈనెల 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు నెల్లిమర్ల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించామన్నారు. మొత్తం 1035 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 806 మంది హాజరయ్యారని, 229 మంది గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు.

శాస్త్రోక్తంగా చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: జేష్ఠ పౌర్ణమితో పాటూ అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో శనివారం చండీయాగం నిర్వహించారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి శాస్త్రోక్తంగా యాగాన్ని చేపట్టారు. యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను యాగంలో పాల్గొన్న భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ట్యాంకులు శుభ్రం.. తాగునీరు సురక్షితం

- స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు
- వాటర్ ట్యాంకుల శుభ్రతకు స్పెషల్ డ్రైవ్
- పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



పూసపాటిరేగలో ఉన్న రక్షిత మంచినీటి పథకం



నీటి స్వచ్ఛతను పరీక్షిస్తున్న అధికారులు

తాగునీటిని శుభ్రత ఇలా..

- ప్రతి 15 రోజులకు ఒకసారి ట్యాంకును శుభ్రం చేయాలి. ట్యాంకు శుభ్రం చేసిన తేదీని అక్కడి బోర్డుపై నమోదు చేయాలి.
- తాగునీటిని సరఫరా చేసే పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలి.
- గ్రామ పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్, లిక్విడ్ క్లోరిన్ స్టాక్ ఉంచుకోవాలి.
- రక్షిత మంచినీటి ట్యాంకుల పరిసరాల్లో నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు తమ పరిధిలో ట్యాంకులను ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలి.
- ముఖ్యంగా తాగునీటికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

పూసపాటిరేగ: నైరుతి రుతుపవనాలు ముందుగానే రావడంతో పలుచోట్ల వర్షాలు విస్తారంగా కురిస్తున్నాయి. వర్షపునీటితో మురుగునీరు కలిసి అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వ్యాధుల నివారణకు, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈనెల 16 నుంచి 30 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నారు. గ్రామాల్లో లీకయ్యే తాగునీటి పైపులను సకాలంలో చూసుకోకపోవడంతో మురుగునీరు పైపుల్లోకి ప్రవేశించి అంటువ్యాధులకు ప్రజలు గురవుతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గ్రామీణ నీటిసరఫరా అధికారులు, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో 292 వాటర్ ట్యాంకులు(ఓవర్ హెడ్ ట్యాంకులు) ఉండగా వాటిలో 161 ట్యాంకులను ఇప్పటివరకు శుభం చేశారు. పూసపాటిరేగ మండలంలో 86 ట్యాంకులకు గాను 42 ట్యాంకులు, డెంకాడ మండలంలో 72 ట్యాంకులకు గాను 46 ట్యాంకులు, భోగాపురం మండలంలో 70 ట్యాంకులకు గాను 35 ట్యాంకులు, నెల్లిమర్ల మండలంలో 64 ట్యాంకులకు గాను 38 ట్యాంకులను అధికారులు పరిశుభ్రం చేయించారు.

స్వచ్ఛమైన నీటి సరఫరాకు చర్యలు

గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు శుభ్రం చేసేందుకు ఈనెల 30 వరకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే ఉన్న ట్యాంకుల్లో సగానికి పైగా ట్యాంకులను శుభ్రం చేయించాం. క్లోరినేషన్ చేయించి ప్రజలకు తాగునీరు సరఫరా చేయిస్తున్నాం.

– ప్రవీణ్ శంకర్,
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పూసపాటిరేగ మండలం

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



బింగివీధిలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ ఎం.ఎం.నాయుడు అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. డక్కిన వీధి, బింగి వీధి, తదితర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో పారిశుద్ధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న టిఫిన్ షాపుల వద్ద సదరు వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లతో చెత్తాచెదారం వేయడంపై అసహనం వ్యక్తం చేశారు. వ్యాపారులను పరిలిచి వారికి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సంచులు, క్యారీ బ్యాగులు వినియోగిస్తే అపరాద రుసుం విధిస్తామని హెచ్చరించారు. పాఠశాలల పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం ఉండాలన్నారు. వీధుల్లో చెత్తాచెదారం వేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరి సహకారం అవసరమని కోరారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నరేష్

విజయనగరం క్రైమ్: మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు, యువతకు వివరించడంతో పాటు వారిని మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా చేసేందుకు చర్యలు చేపట్టామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. పట్టణంలోని మహారాజా, ఆదిత్య డిగ్రీ కళాశాలల విద్యార్థులతో శనివారం మమేకమయ్యారు. గంజాయి, డ్రగ్స్, హెరాయిన్, గుట్కా, ఖైనీ, తదితర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తుకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని కోరారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు ప్రణాళికతో కృషిచేయాలని సూచించారు. ఎక్కడ ఎటువంటి మాదక ద్రవ్యాల సరఫరా జరుగుతున్నా వెంటనే తమకు తెలియజేయాలని కోరారు. అనంతరం మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు.

సన్నిబాబు మృతికి సీపీఐ నేతల నివాళి



సన్నిబాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల: సీపీఐ నాయకుడు సన్నిబాబు మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు అన్నారు. సీపీఐ నెల్లిమర్ల నియోజకవర్గ కార్యదర్శి తాలాడ సన్నిబాబు భౌతిక కాయానికి శనివారం ఆయన నివాళి అర్పించారు. సన్నిబాబు శుక్రవారం రాత్రి 9 గంటలకు గుండెపోటుతో విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మృతిచెందారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు రంగరాజు, నాయకులు అలమండ అనంతరావు, సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు సన్నిబాబు భౌతిక కాయంపై పార్టీ జెండాను కప్పి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాల సాధన కోసం సన్నిబాబు ఎంతగానో కృషిచేశారన్నారు. విజయనగరంలో సీపీఐ భవన నిర్మాణం, జిల్లాలో పార్టీ నిర్మాణం, కార్మికోద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సన్నిబాబు ఆశయాలను కొనసాగించేందుకు ఆయన కుటుంబ సభ్యులు ముందుకు రావాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ.. సన్నిబాబు నెల్లిమర్ల నియోజకవర్గంలో ఏ చిన్న సమస్య వచ్చినా ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారానికి కృషి చేసేవారని, ఆయన మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో పూర్వ ఇప్టా జిల్లా కార్యదర్శి కాళ్ల సన్యాసిరావు, సీపీఎం నాయకులు కిల్లంపల్లి రామారావు, సుంకరి సన్యాసిరావు, కాళ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ నివాళి

తాళాడ సన్నిబాబు మృతికి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు నివాళులర్పించారు. ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి అంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి



అంధ విద్యార్థులకు స్టిక్స్ పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: ప్రతి ఒక్కరూ సంవత్సరంలో ఒకరోజు సమాజ సేవ చేయాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అదనపు కోశాధికారి కాల్వ హరికృష్ణ పిలుపునిచ్చారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజానికి సేవ చేసేందుకే వాసవీ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి సభ్యుడు సేవే పరమావధిగా పనిచేయాలని కోరారు. వాసవీ క్లబ్ విజయనగరం, వనిత విజయం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ మురళీకృష్ణ పర్యవేక్షణలో పేద వర్తకులకు గొడుగులు, అంధ విద్యార్థులకు స్టిక్స్, వీధి వ్యాపారులకు తోపుడు బళ్లు, హయగ్రీవ పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, చాక్లెట్లు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ట్రాఫిక్ పోలీసులకు రేడియం జాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు చెన్నాబుచ్చి జనార్ధనరావు, కార్యదర్శి కట్టమూరి రత్నారావు, కోశాధికారి విజ్జపు విజయ్‌కుమార్, సహకోశాధికారి విన్నకోట రమేష్, గుంపిన ఇందిర, వాసవీ వనిత విజయం అధ్యక్షురాలు పి.ప్రభావతి, కందుల సంతోష్, రీజియన్ సెక్రటరీ సముద్రాల నాగరాజు, ఏవీఎస్ కుమార్, గూడూరు నరసింగరావు, గుంపిన నారాయణరావు, ఏడుకొండలు, మండవిల్లి వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేదగాయత్రీమాత ఆలయ వార్షికోత్సవం

విజయనగరం టౌన్:

స్థానిక పద్మావతీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న శ్రీలక్ష్మీగణపతి, కాశీవిశ్వేశ్వర, వల్లీదేవసేన సమేత వేదగాయత్రీ దేవీ ఆలయ 10వ వార్షికోత్సవ నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీరాములు, రాజశేఖర్, శ్రీనివాస్, తదితరులు శనివారం తెలిపారు. ఈ నెల 23న ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రుద్రాభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం, 24న మండపారాధనలు, చండీ హోమం, పూర్ణాహుతి, 25న వేదగాయత్రీ మాత మూలవిరాట్‌కు అభిషేకాలు, విశిష్ట పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేరోజు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, నక్షత్ర హారతి, ఊంజల్ సేవ, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: వేణుగోపాలపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం(బాలికలు) పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.ఉషారాణి శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 25 లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఏ గురుకుల పాఠశాలలో చేరాలని కోరుకుంటున్నారో వారికి అదే పాఠశాలలో ఈనెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షకు విద్యార్థి ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతో హాజరు కావాలని సూచించారు. ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ, రిజర్వేషన్ కేటగిరీ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి ఉపాధి సోషల్ ఆడిట్

డెంకాడ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి ఆదివారం నుంచి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లవరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి ఆడిట్ అధికారులు, సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు రూ.20 కోట్లు ఉపాధి నిధులతో వివిధ పనులు చేపట్టామన్నారు. నిధుల ఖర్చుకు సంబంధించి ఆడిట్‌ను పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో చేపట్టిన పనులు, బిల్లు చెల్లింపులు, రికార్డులు క్షుణ్ణంగా తనిఖీ చేసి నివేదిక అందజేయాలన్నారు.

ఆర్‌ఈసీఎస్‌ను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాబూరావు

చీపురుపల్లి: గ్రామీణ విద్యుత్ సహకార సంఘం(ఆర్‌ఈసీఎస్)ను పునరుద్ధరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు కోరారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1982లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిది ఆర్‌ఈసీఎస్‌లను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అందులో చీపురుపల్లి ఆర్‌ఈసీఎస్ ఒకటని పేర్కొన్నారు. చీపురుపల్లి ఆర్‌ఈసీఎస్ ప్రజలకు, రైతులకు ఎంతో విలువైన సేవలు అందిస్తూ లాభాల బాటలోనే నడిచిందన్నారు. ఆర్‌ఈసీఎస్ ద్వారా చీపురుపల్లి ప్రాంతంలో వ్యవసాయ బోర్లు అధికంగా ఉండడంతో రైతులు పంటలు సాగు చేసుకుని పిల్లలను చదివించుకుంటూ అభివృద్ధిలోకి వచ్చారని చెప్పారు. ఆర్‌ఈసీఎస్ పరిధిలో దాదాపు పది వేల వరకు వ్యవసాయ బోర్లను రైతులు వినియోగిస్తున్నారని చెప్పారు. పది వేల విద్యుత్ సర్వీసులతో ప్రారంభమైన ఆర్‌ఈసీఎస్ ప్రస్తుతం 70 వేలకు పైగా విద్యుత్ సర్వీసులకు సేవలు అందిస్తోందన్నారు. గత ప్రభుత్వం ఆర్‌ఈసీఎస్‌ను రద్దు చేసి ఏపీఈపీడీసీఎల్‌లో విలీనం చేసిందని పేర్కొన్నారు. అయితే ఎన్నికల ప్రచారంలో భాగంగా సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చీపురుపల్లి బహిరంగ సభలో ఆర్‌ఈసీఎస్‌ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అందుకే స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బాలకృష్ణతో కలిసి సీఎం చంద్రబాబునాయుడును కలిసి సమస్యను వివరించి, చీపురుపల్లి ఆర్‌ఈసీఎస్‌ను పునరుద్ధరణకు విజ్ఞప్తి చేయాలని కోరారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, అధికారులపై టీడీపీ కౌన్సిలర్ల మాటల యుద్ధం
- మోటార్లతో తాగునీటి చౌర్యానికి పాల్పడుతున్న వారిపై కేసులు
- ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారుల పనితీరుపై అసంతృప్తి
- రెండు సమావేశాల్లో 20 అంశాలకు ఆమోదం



హాజరైన కార్పొరేటర్లు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాలు శనివారం వాడీవేడిగా సాగాయి. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ఈ రెండు సమావేశాల్లో 20 అంశాలతో కూడిన అజెండాలను ప్రవేశపెట్టగా.. వాటికి కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. సమావేశంలో తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు చేయించడంలో లోపాలు, నగరంలోని భవనాలకు పన్ను మదింపులో అవకతవకలపై కౌన్సిల్ సభ్యులు సంబంధిత అధికారులను ప్రశ్నించారు. నగరంలో తాగునీటి కుళాయిలకు మోటార్లు బిగించి నీటి చౌర్యానికి పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించాలని కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. గడిచిన 5 ఏళ్లలో నగరంలోని 50 డివిజన్‌లలో కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన పనుల వివరాలను కౌన్సిల్ సభ్యులకు అందజేయాలని కోరారు. అదేవిధంగా ఇకపై ఆయా వార్డుల్లో జరిగే ప్రతీ కార్యక్రమం వివరాలు స్థానిక కార్పొరేటర్‌కు తెలియజేయాలని సూచించారు. పార్టీల పేరుతో విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు.

కమిషనర్‌కు కోఆప్షన్ సభ్యురాలికి మధ్య వాగ్వాదం

సమావేశంలో టీడీపీకి చెందిన కౌన్సిలర్ కర్రోతు రాధామణి, కోఆప్షన్ సభ్యురాలు ముద్దాడ రమణి మాట్లాడుతూ.. ఇకపై కార్పొరేషన్‌లో జరిగే ప్రతీ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యేకు తెలియజేయాలంటూ అధికారులను హెచ్చరించారు. ఇటీవల కార్యాలయం పరిధిలో జరిగిన అంతర్గత బదిలీల విషయం ఎందుకు తెలియజేయలేదంటూ కమిషనర్‌ను ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ మల్లయ్యనాయుడు స్పందిస్తూ.. మున్సిపల్ యాక్ట్ ప్రకారం పరిపాలన సౌలభ్యం మేరకు మేయర్ అనుమతితో అంతర్గత బదిలీలు చేపట్టామని, ఈ విషయంలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించలేదని వివరించారు. అదేవిధంగా నీటి సరఫరాలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రంగు మారిన నీళ్లు సరఫరా చేస్తున్నారంటూ పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై కమిషనర్ మల్లయ్యనాయుడు, కోఆప్షన్ సభ్యురాలు ముద్దాడ రమణి మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. ముందస్తుగా మీడియా ద్వారా సమాచార మిచ్చి పైప్‌లైన్‌ల మార్పు పనులు చేపట్టామని, దీంతో ఒకటి రెండు రోజులు బురద నీరు వస్తుందని, ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని కమిషనర్ సమాధానమిచ్చారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

సాధారణ సమావేశంలో అజెండాలోని 4వ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు అధికారుల తీరుపై మండిపడ్డారు. వీధి కుక్కల నియంత్రణకు చేపడుతున్న శస్త్రచికిత్సలు లోపభూయిష్టంగా ఉన్నాయంటూ ఆరోపించారు. కనీసం వార్డు స్థాయిలో ఉన్న కార్పొరేటర్‌తో సంబంధం లేకుండా చికిత్సల పేరిట ప్రజాధనాన్ని ఖర్చు చేయడం ఏమిటని ప్రశ్నించారు. చికిత్సలు చేసిన కుక్కలు అనారోగ్యంతో ప్రజల మధ్య సంచరిస్తుండడంతో వ్యాధుల ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి ఇకపై అటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు.

రెవెన్యూ సిబ్బంది ఇష్టారాజ్యం

కార్పొరేటర్ జీవీ రంగారావు మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలో ఉన్న ఆర్‌ఐలు ఇష్టారాజ్యాంగా పన్నులు విధించడం వల్ల, ఇంటి పన్ను వ్యాపార సంస్థలు పన్నుగా, వ్యాపార సంస్థలకు ఇంటి పన్నులు వేసి ప్రజల్లో మాపై వ్యతిరేకత రావడానికి కారణమయ్యారాన్నరు. అనంతరం బాబమెట్టకు చెందిన కార్పొరేటర్ గాధం మురళి మాట్లాడుతూ.. నగరంలో 50 డివిజన్లలో ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఏమి చేస్తున్నారని, లంచాలు తీసుకొని అనుమతులు ఇస్తున్నారా అంటూ నిలదీశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలుకు అనుమతులు ఇవ్వడంపై మండిపడ్డారు. కంటోన్మెంట్ ఏరియాకు చెందిన కార్పొరేటర్ బి.ధనలక్ష్మి మాట్లాడుతూ.. పన్నులు వేసే విధానం బాగులేదన్నారు. అదే ఇటీవల జరిగిన ఎన్నికల్లో తమ పార్టీ ఓటమికి కారణమైందని ఆరోపించారు. మరోవైపు టీడీపీ కార్పొరేటర్లు గెలుపు దర్పంతో వ్యవహరించటం సరికాదని, నగరాభివృద్ధికి ఏమి చేస్తారో చెప్పాలన్నారు. 44వ డివిజన్ కె.ఎల్.పురం ప్రాంతానికి చెందిన కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషి మాట్లాడుతూ.. తమ వార్డుల్లో వాటర్ ట్యాంక్ నిర్మాణం జరిగి ఆరు నెలలు అవుతున్నా నేటికీ ఆ ప్రాంతం వారికి కుళాయి కనెక్షన్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కుళాయి కనెక్షన్ల కోసం 200లకు పైగా దరఖాస్తులు పెట్టుకుంటే కేవలం రెండు కుళాయిలు ఆరు నెలల్లో వ్యవధిలో వేశారని, మిగిలినవి ఎందుకు వేయలేదో సమాధానం చెప్పాలని అధికారులను నిలదీశారు.